## నాణ్యమైన విద్యతోనే గ్రామాభివృద్ధి



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట


శనివారం | 20 జూన్, 2026 | పేజీలు :08

### వాతావరణం అనుకూలతను బట్టి
# రైతులు పంటల సాగుచేయాలి : ఎమ్మెల్యే గండ్ర




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వాతావరణ అనుకూలతను బట్టి రైతులు పంటల సాగు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని ఎఎస్ ఆర్ గార్డెన్స్ లో వ్యవసాయ శాఖ ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధికి 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినట్లు స్పష్టం చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో సమృద్ధిగా అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట మార్పిడి ద్వారా అధిక ఆదాయం పొందే విధంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. మక్కలు, అపరాలు, వాణిజ్య పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. ఇట్టి పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం యొక్క ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ రైతుల యొక్క సంక్షేమానికి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు ఆరుకాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పంటలు సాగుపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ మేళాలో పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేత పరిజ్ఞానం అందుబాటులో ఉన్నదని వాటన్నిటిని వినియోగించుకోవాలని సూచించారు. భూసారన్ని బట్టి పంటలు సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ శాఖ సూచన ప్రకారం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటలు సాగకు రైతుల మొగ్గు చూపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ శాఖ ద్వారా ప్రణాళిక తయారు చేశారని, ఆ ప్రణాళిక ప్రకారం రైతులు పంటలు సాగు చేపట్టాలని తెలిపారు. పంటల వైవిధ్యం వల్ల భూసారం పెరుగుతుందని వ్యవసాయ సాంకేతిక శాస్త్రవేత్తలు యొక్క సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. యూరియా రైతువేదికలలో విక్రయిస్తున్నామని పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. యూరియా కొరకు రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపటైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , వ్యవసాయ అధికారి బాబూరావు, స హకార అధికారి వాలియా నాయక్, పశు సంవర్ధక అధికారి డా॥ కుమా ర స్వామి, ఉద్యాన అధికారి తిరుపతి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొముర య్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, సింగిల్ విండో చైర్మన్లు తిరుపతి రెడ్డి, కుమార్ యాదవ్, సంపత్, నర్సింగ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు కిష్టన్న, పంతగాని తిరుమల, గుమ్మడి శ్రీదేవి వ్యవసాయ అధికారులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



వివరాలు మెయిన్‌లో...

## నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు : కలెక్టర్



వివరాలు మెయిన్‌లో...

## కుట్టు మిషన్ల పంపిణీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

### ఇజిఎస్ నిధులతో సిసిరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన
### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పజాపక్షం/నడికూడ:** నడికూడ మండలం ధర్మార ం,రామకృష్ణాపురం, కంఠాత్మకూర్, సర్వాపూర్, కౌకొండ, నడికూడ, పులిగిల్ల, నర్సక్కపల్లి, రాయపర్తి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి,చర్లపల్లి,వరికోల్,నార్లపూర్,వెంకటేశ్వర్లపల్లి గ్రామాలలో ఎంజిఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనాయకులు,కాంట్రాక్టర్లను చూసి అభివృద్ధి పనులు చేపట్టారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని గ్రామాలలోని ప్రతి వార్డులోను ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని తెలిపారు.బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ధనాన్ని దోచుకొని పాపాలు పోవడానికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారనిమాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కాంట్రాక్టర్ ముసుగులో దోచుకుంటున్నాడని పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్,కళ్యాణ లక్ష్మి ,ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తున్నమని ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సన్న బియ్యం పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూ గ్యాస్ సిలిండర్,2 లక్షల లోపు రైతు రుణమాఫీ,ఇందిరమ్మ ఇళ్లు,సన్న వడ్లకు 500 రూ బోనస్,గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు,ఇందిరమ్మ చీరల పంపిణీ,వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,తదితర సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బాషిక ఎల్ల స్వామి,కుడ్ల మలహల్ రావు, ఉప సర్పంచ్ తరిగొప్పుల సంపత్,కొంగంటి తిరుపతి,బోగి శ్రీలత,పెండ్లి లక్ష్మి రాజు,రాజా జగత్ ప్రకాష్,కోడెపాక ముత్యాలు ఐలయ్య,ఎంపీడీవో రామకృష్ణ,తహశీల్దార్ రాణి, మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్,కార్యదర్శులు, అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వివరాలు మెయిన్‌లో...


## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మంగపేట:**మంగపేట మండలం దోమెడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇర్ప భూషణం కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి దశదిన కర్మల నిమిత్తం 4 వేల రూపాయలు 25 కేజీల బియ్యంను ఆర్థిక సహాయంగా బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు బాడిశ నాగరమేష్ వారి యొక్క శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ బాడిశ నవీన్, ట్రస్ట్ సభ్యులు మునిగేల మహేష్, కొమరం లక్ష్మయ్య, మేకల పుల్లయ్య, మేకల సాంబశివరావు, మేకల సందీప్ కుమార్, జాడి నర్సింగరావు, ఎండీ ముస్తప్ప, దుర్గం, గణేష్, కొమరం లింగయ్య, కొమరం సుభాష్, పాయం నితిన్, కొమరం వెంకటేష్, మునిగేల నరేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు

**ప్రజాపక్షం/రాయపర్తి:**మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలు ఎండి చెత్తబి, ఎండి లాలు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించగా బాధిత కుటుంబాలను శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి పరామర్శించి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 50 కేజిల బియ్యం నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రఫ్ పాషా, గిరిక సురేష్, ఎండి అన్వార్, ఎండి ఖలీల్, ఎండి నాసర్, బూడిద సోమయ్య, శ్రీను,అబ్దుల్లా,అబ్బాస్పాల్గొన్నారు.

## డిజిటల్ లెర్నింగ్ అంశాలపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వ పాలిటెలిక్నిక్ కళాశాలలో ఏఐ పై శిక్షణ సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్నా. అక్క మెంటార్ షిప్ లో కార్యక్రమంలో భాగంగా కృతిమ మేదస్సు డిజిటల్ లెర్నింగ్ అంశాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల విద్యాశాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆవిడ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థులు ఏఐ డిజిటల్ సాంకేతికపై అవగాహన పెంచుకోవాలసిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణా విద్యార్థులకు ఆధునిక బోధన నైపుణ్యాలను అందిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి జానకీ దేవి శిక్షణలో పాల్గొని ఏఐ వినియోగం డిజిటల్ సాదనలు స్మార్ట్ తరగతి గదులు, ఆన్లైన్ విద్య అవసరాలు ,ఆదునిక బోధన విదానాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎం దేవ సుగుణరావు, నోడల్ ఆఫీసర్టీ టి.మంజుల కళాశాల ప్రిన్సిపల్ పి.జానకి దేవి ఈఈఈ డిపార్మెంట్ హెచ్ఓడి ఇందిరా ప్రియదర్శిని అద్యాపకులు ,విద్యార్థులు ఉత్సాహంగా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనను విరమించుకోవాలి

### బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం /వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరంలోని రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. నియంతృత్వ విధానాలతో ప్రపంచ ఆధిపత్యానికి ప్రయత్నిస్తున్న యుద్ధోన్మాది ట్రంప్ పేరును శాంతియుత సహజీవనానికి పేరుగాంచిన హైదరాబాదు నగరంలోని రోడ్డుకు పెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. రెండవసారి అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత ట్రంప్ అమెరికాలోని భారతీయ విద్యార్థులకు, ఉద్యోగులకు హాని కలిగించే అనేక చర్యలు చేపట్టాడన్నారు. న్యూయార్క్ లోని ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అక్కడ అధికారులు భారతీయ విద్యార్థిని అమానుషంగా కిందపడేసి చేతికి సంకెళ్లు వేసి కనీస మానవత్వం లేకుండా కిరాతకంగా వ్యవహరించడం, అనేకమంది భారతీయులకు సంకెళ్లు వేసి ఇండియాకి పంపించిన విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ట్రంపు విధానాలతో అమెరికాలో విద్యను అభ్యసిస్తున్న మన విద్యార్థులు భయాందోళనలతో ఉన్నారన్నారు. ఇటీవల భారతీయ వాణిజ్య నౌకపై అమెరికా నౌకాదళం దాడి చేసి ముగ్గురు భారతీయులను చంపిన విషయాన్ని మరిచిపోతే ఎలా అన్నారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ప్రపంచ ఆధిపత్యం కోసం ట్రంప్ అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలే కారణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాదులోని రోడ్డుకు ట్రంప్ పేరును పెట్టడం విరమించుకోవాలని లేనిచో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం



**ప్రజాపక్షం/నెక్కొండ:** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్..2026) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నెక్కొండ మండలంలో బూత్ లెవెల్ అధికారులు(బిఎల్ఓలు), ఎన్యూమరేటర్లకు అధికారులు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, తహసీల్దారు వేముల రాజ్ కుమార్, శిక్షణ అధికారి బండారి రమేష్, శిక్షణదారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్లు తొలగించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 25 నుండి జులై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అదే రోజు నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని వివరించారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని కొందరు బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస పోయిన వ్యక్తులు అక్కడ ఓటు ఇక్కడ ఓటు ఉండడం చట్ట విరుద్ధమని, అలాంటి వారు ఒకే చోట ఓటు ఉండేలా ఇప్పుడే సరి చేసుకుఓవాలని ఆయన సూచించారు. జులై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు విచారణలు, ధృవీకరణ ప్రక్రియలు నిర్వహించి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిఆపరు. ప్రతి బిఎల్, ఎన్యూమరేటర్ బాధ్యతాయుతంగా పని చేసి ఓటరు జాబితాను తప్పులు లేని విధంగా రూపొందించాలని అధికారులు సూచించారు. ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లు ఓటరు జాబితాలో ఉందో లేదా పరిశీలించుకోవాలని, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, డిప్యూటీ తహసీల్దారు పలకొండ రవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హంస నరేందర్, మండల స్థాయి సిబ్బంది, బిఎల్ఓలు, ఎన్యూమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**ఎర్రబెల్లి ప్రదీప్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ కెవిఎస్ ప్రాంతంలో శంకర్ కంటి హాస్పటల్ వారి సహకారంతో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 2వేల మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్యుల బృందం పాల్గొని రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, తదుపరి చికిత్సపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి వినీత్‌రావు మాట్లాడుతు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం మా ట్రస్టు యొక్క ప్రధాన లక్ష్యం, ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు, ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి ఉచిత కంటి శిభిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కెళ్ళపల్లి రాజేశ్వర్‌రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దం నరేష్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీష్ షా, మల్లాడి తిరుపతి రెడ్డి, రాణా ప్రతాప్ రెడ్డి, త్రిలోక్, స్థానిక నాయకులు, వైద్యులు, వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ముదిరాజ్ భవన్ ప్రారంభోత్సవం

### మాద్రి వృథ్వీరాజ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గుమ్మడిదల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎండి ఆర్ పౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి వృథ్వీరాజ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆద్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని సంఘ ప్రతినిధులు పెద్దలను అభినందించారు. సమాజ ఐక్యత అభివృద్ధి ,యువత ప్రగతికి ఇటువంటి సంఘ భవనాలు కేంద్ర బిందువులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.

## ఎం.ఆర్.ఐ యంత్రం ప్రారంభానికి సిద్ధం

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం / భూపాలపల్లి :**జిల్లా కేంద్రం లోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న ఎంఆర్ఐ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. యంత్రం ఏర్పాటు పనులు తుదిదశకు చేరుకున్నాయని, ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల జిల్లాలోనే అధునాతన వైద్య సేవలు ప్రజలకు లభిస్తాయని తెలిపారు. ఎంఆర్ఐ చేసిన వ్యక్తుల పేర్లు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎంఆర్ఐ వైద్య సేవలకు ఇప్పటి వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, ఇకపై సమయానుకూలంగా, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో రోగులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా రాజేంద్రప్రసాద్, వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడు పండ్ల సమృద్ధి... ప్రకృతి హెచ్చరికేనా?

**ప్రజాపక్షం/నెక్కొండ:** ఈ ఏడాది గ్రామాలు, పట్టణాల పరిసర ప్రాంతాల్లో నేరేడు చెట్లు అసాధారణంగా అధికంగా పండ్లు కాయించడం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నేరేడు పండ్లు చెట్ల నుండి రాలి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్దలు చెప్పే సాంప్రదాయ జ్ఞానం ప్రకారం నేరేడు చెట్లు విపరీతంగా పండ్లు కాయిస్తే రాబోయే రోజుల్లో నీటి కొరత లేదా కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉంటాయని భావిస్తారు. వృక్ష శాస్త్రవేత్తలు కూడా ఈ పరిస్థితిని స్ట్రెస్ ఫ్రూటింగ్ లేదా మాస్టింగ్‌గా పేర్కొంటున్నారు. భూగర్భ జలాలు తగ్గడం, వాతావరణ మార్పులు వంటి ఒత్తిడి పరిస్థితుల్లో చెట్లు తమ జాతి మనుగడ కోసం అధికంగా పండ్లు, విత్తనాల ఉత్పత్తి చేస్తాయని నిపుణులు వివరిస్తున్నారు. ప్రకృతి సంకేతాలను గుర్తిస్తూ నీటి వనరులను సంరక్షించుకోవాలని, నీటి వినియోగంలో ప్రజలు పొదుపు పాటించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. నేరేడు పండ్ల సమృద్ధి ఆనందాన్ని ఇచ్చినప్పటికి, ప్రకృతి ఇస్తున్న హెచ్చరికను కూడా విస్మరించరాదని వారు అభిప్రాయపడుతున్నారు.

## హనుమాన్ దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం సరస్సు కట్టపై కొలువైన శ్రీ దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం అంకురార్పణ జరిగింది నూతన ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించనున్న తరుణంలో ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గదిలోకి తరలించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆలయ అర్చకులు గోవర్ధన వేణుగోపాల ఆచార్యులు మొదట గణపతి పూజ అభిషేకం అవభ్రుత స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించగా పూజ క్రతువులను గణపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, రంగు విశ్వేశ్వర్ శైలజ దంపతులు నిర్వహించారు. మూల విరాట్ తరలింపు అనంతరం అర్చకులు వేణుగోపాలచార్యులు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వడ్లకొండ నారాయణ గౌడ్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, బోనాల రాజమౌళి, గర్రెపెల్లి బాలరాజు, బత్తిని శివశంకర్ గౌడ్, వార్డు సభ్యులు కోడెపాక అనిల్, గంధం ఓదాకర్, హనుమాన్ భక్తులు గోలి రవి, మాదాసు అర్జున్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :**ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా (Closing the Survival Gap: Equity in Sickle Cell Disease) అనే థీమ్ తో సంగారెడ్డి జిల్లాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖాధికారి డా. లలితా దేవి ప్రారంభించారు. సికిల్ సెల్ వ్యాధి నివారణ ముందస్తు నిర్ధారణ స్క్రీనింగ్ చికిత్స ,జన్యు సలహాపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డా. కె. నాగ నిర్మల డా. శశాంక్ ,డా. శైలజ , డా శశికర్, తదితర ఆరోగ్య శాఖఅధికారులు, సిబ్బంది, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు..

## సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం / కమలాపూర్/నడికుడ :** నడికూడ,కమలాపూర్ మండల పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో సి.సి. రోడ్స్ కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలమేరకు మా గ్రామనికి ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ గ్రాంటు నుండి 10 లక్షలు కోసం వెంకటేశ్వర్లపల్లి గ్రామ పంచాయతీ కీ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి గ్రామ పంచాయతీ పాలక వర్గం నుండి ప్రతిపాదనలు పంపించాలని తెలియజేయగా కావున గ్రామ సర్పంచ్,పాలక వర్గం నుండి ప్రతిపాదనలు పంపించారు.10లక్షలసిసి రోడ్స్ ను ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నుండి మాంజురు చేశారు.పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికిగ్రామ ప్రజల నుండి ప్రత్యేకధన్యవాదలు తెలుపుతూ మా గ్రామానీకి ఎక్కువ నిధులు ఇవ్వాలని వారిని కోరుచున్నామని వెంకటేశ్వర్లపల్లి గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి తెలిపారు.

# ముల్కనూర్ మహిళా డెయిరీని సందర్శించిన ఎస్ఎల్ఎన్ టి. శ్రీనివాస్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ముల్కనూర్ డెయిరీని శుక్రవారం నాడు మెంబెర్, ఆల్ ఇండియా ఆథర్స్ కమిటీ, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ,భారత ప్రభుత్వం సహకార రంగ నిపుణులు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్ ముల్కనూర్ మహిళా డెయిరీని సందర్శించి సంస్థ కార్యకలాపాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాల సేకరణ, నాణ్యత నియంత్రణ, మహిళా సభ్యుల భాగస్వామ్యం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ మరియు ఆర్థిక నిర్వహణ అంశాలపై డెయిరీ ఎండి భాస్కర్ రెడ్డితో చర్చించారు. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ముల్కనూర్ మహిళా డెయిరీ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. డెయిరీ అభివృద్ధి, విస్తరణ, మహిళా సభ్యుల సంక్షేమం కోసం మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి అందిస్తున్న దూరదృష్టి నాయకత్వం, అంకితభావం, నిరంతర కృషిని డాక్టర్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సంస్థ సిబ్బంది సభ్యులు నిబద్ధతతో అందిస్తున్న సేవలు డెయిరీ విజయానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.సహకార స్ఫూర్తితో మహిళల ఆదాయ వృద్ధి, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధికి ఈ సంస్థ విశిష్ట సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో శిక్షణ, డాక్యుమెంటేషన్, సామర్థ్య వృద్ధి, సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలలో తన వంతు సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఈ సంస్థ పురోగతి రెండు తెలుగు రాష్ట్రాలకి గర్వ కారణం అని డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# అంగన్వాడి విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

## చర్లపల్లి సర్పంచ్ బండి రేణుక శంకర్



**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ ముదిరాజ్ మొక్కలను నాటారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మొక్కలను నాటాలని లేదా పిల్లల పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటాలని తల్లిదండ్రులను ఈ సందర్భంగా కోరారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూచెట్లు మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్ను అందిస్తాయని చెట్లు పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతాయని,చెట్లు మనకు నీడను ఇస్తాయని,చెట్లు పండ్లు, పూలు,ఔషధాలను అందిస్తాయని,చెట్లు నేల కోతను నివారిస్తాయని,పక్షులు,జంతువులకు చెట్లు ఆశ్రయం కల్పిస్తాయని,చెట్లు వాతావరణ సమతుల్యతను కాపాడుతాయని,ప్రతి మనిషి కనీసం ఒక చెట్టును నాటాలని,చెట్లను రక్షించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.అనంతరం అంగన్వాడి కేంద్రము 1,2 లలో సర్పంచ్ బండి రేణుక శంకర్ ముదిరాజ్ అంగన్వాడి విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు ,అంగన్వాడీ టీచర్స్,గ్రామపంచాయతీ సిబ్బంది , ఆయాలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే నిర్వహించిన పిడిఎస్‌యు




**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** పిడిఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వం పాఠశాలలో సర్వేను శుక్రవారం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ హనుమకొండలోని లష్కర్ బజార్లో ఉన్న ప్రభుత్వం మర్కజి హై స్కూల్ లో సర్వే ప్రారంభించి ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ ప్రాక్టీస్ హై స్కూల్లో మొదటి రోజుల్లో భాగంగా సర్వే నిర్వహించడం జరిగింది. ఈ స్కూళ్లలో కొన్ని స్కూళ్లలో చదువు చెప్పడానికి టీచర్స్ కోరుతూ ఉందని మర్కాజి హైస్కూల్లో హిందీ బోధించడానికి టీచర్స్ కొరత ఉందని గేమ్స్ ఆడిపించడానికి స్కూల్ మొత్తంలో ఒక్కరే పీఈడి ఉన్నారని మరొకరి అవసరం ఉందని అలాగే టాయిలెట్ సరిపోను లేవని ప్రాక్టీసీగ్ హైస్కూల్లో పర్మినెంట్ టీచర్స్ లేరని డిప్యూటేషన్ మీద వచ్చిన వారే ఉన్నారని,బాయ్స్ కి మొత్తానికి టాయిలెట్స్ లేవని ఉన్న స్కూళ్లలో క్లీన్ చేయడానికి స్కావెంజర్స్ లేరని గర్ల్స్ హైస్కూల్లో వాన పడినప్పుడు గ్రౌండ్లో నీళ్ళు అగుతున్నాయని క్లాస్ రూమ్ లోకి నడవడానికి కూడా ఇబ్బంది అవుతుందని. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ స్కూల్ ల సమీపంలోనే ప్రైవేట్ పాఠశాలలు నెలకొన్నాయని తక్షణమే డీఈఓ జిల్లా కలెక్టర్ స్పందించి ఈ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ కార్యవర్గ సభ్యులు వంగవీటి మోహన్ జిల్లా నాయకులు రమణ, విశ్వతేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

## సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రయివేటు విద్యా సంస్థలు, స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్ర,ఆయా జిల్లాలలో ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆయా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా విద్య సంస్థల ను నిర్వహిస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు విద్యాసంస్థల యాజమాన్యం కుమ్మక్కై ప్రైవేట్ విద్యా సంస్థల పైన తనిఖీలు,దాడులు చేయడం లేదని ఆరోపించారు.ప్రైవేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు టై, బెల్టులు, డ్రెస్సులు విచ్చలవిడి గా అమ్ముతూ వివిధ రకాల ఫీజుల పేరు తోటి విద్యార్థుల ను,తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు ఈ స్కూ ల్స్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ ను అమలు చేయడం లేదన్నారు .విద్యను వ్యాపారంగా మార్చేసి అధిక ఫీజులను వ సూలు చేస్తున్నారని స్కూళ్లకు సరైన గ్రౌండ్,సరైన మూత్రశాలు, మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు పడుతున్న వి ద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రై వేటు పాఠశాలల యాజమాన్యాలు బుక్ స్టాల్ షాప్ ల తోటి కుమ్మక్కై పర్సంటేజ్ లతో పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. అక్రమ పుస్తకాల అమ్మకాలను నిలిపివేయాలని కోరారు.

# 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/జనగామ:** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, జిల్ల వైద్యశాఖ, ఆయుష్ ఆధ్వర్యంలో ఈనెల 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో మల్లిఖర్జున రావు, జిల్లా ఆయుష్ అధికారి మమత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# సెర్ప్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం :కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి దివ్య ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో పాల్గొన్న సిబ్బందికి రక్తపోటు , షుగర్, ఇసిజి, సిబిపి, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షియం, తదితర వైద్య పరీక్షలు 155 మందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భాస్కర్, నూరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో ఇటీవల మాజీ సర్పంచ్ ఉప్పునూతల మల్లయ్య కుమారుడు రవీందర్ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను సీపీఐ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జువారి రమేష్ మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకునేవిధంగా తమ పార్టీ సహాయ సహకారాలు ఎల్లవేళలగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు యాకూబ్ పాష, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి సుధాకర్, నాయకులు నూర్సిస, పెద్ద రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# తాండ్ర సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి :సిపిఎం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** గాలి దుమారానికి ఇల్లు దెబ్బతిన్న దళిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని శామీర్‌పేట గ్రామంలో ఇటీవల వీచిన గాలి దుమారంతో రేకుల పైకప్పులు లేచివచ్చి తాండ్ర సాయిలు నిర్మిస్తున్న ఇంటిపై పడింది. దీంతో గోడలు కూలి ఇల్లు పూర్తిగా దెబ్బతింది. కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి బయటపడినా, రాత్రంతా కరెంటు లేక ఇబ్బంది పడ్డారు. శుక్రవారం సిపిఎం జిల్లా కమిటి బృందం స్థలాన్ని పరిశీలించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదగిరి, నాయకులు ఉపేందర్, కనకచారి, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధిపై పుట్టమధు వైఖరిని ఖండిస్తున్నాం

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ అభివృద్ధిపై పుట్ట మధు వైఖరిని ఖండిస్తున్నామని కోట్ల రూపాలయతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్న రాష్ట్ర ఐటి పరిశ్కమ శాఖ మంత్రి ధుద్దిళ్ల శ్రీధర్ బాబుపై విమర్శలు సరికాదని రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ చైర్మెన్ ఐత ప్రకాష్ రెడ్డి,జిల్లా గ్రందాలచయ చైర్మెన్ కోట రాజబాబు,కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి,కట్కం అశోక్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రం లోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సుందరంగా ఉందని అలాంటి కట్టడం పూర్తైతే శ్రీధర్ బాబుకు కీర్తిప్రతిష్టలు వాస్తయనే కుళ్లుతో దేశాలయ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా శ్రీధర్ బాబుపై పుట్టమధు విమర్శలు చేస్తున్నాడని అన్నారు.ఏడు లోల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని దివాళా తీయించిన విషయాన్ని అప్పతి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు వివరించడానికి అలా మాట్లాడారని అన్నారు.రాష్ట్ర ప్రబుత్వం వద్ద డబ్బులు లేవుకదా అబివృద్ది ఎలా చేస్తారంటూ ప్రశ్నించడం పుట్టమదు మూర్కత్వానికి నిదర్శనమని అన్నారు.రాష్ట్రాన్ని అబివృద్ధి చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.మంథని నియోజకవర్గానికి కోట్ల రూపాలయ నిధులు తెస్తూ అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే మంథని నియోజకవర్గాన్ని ముందు వరుసలో ఉంచడానికి కృషి చేస్తున్న శ్రీధర్ బాబును విమర్శించడం పుట్ట మధు విజ్ఞత తెలుస్తోందని అన్నారు.భారత దేశంలోనే గొప్ప పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ అభివృద్ధిపై విమర్శలు చేయడం భక్తుల మనోబావాలను దెబ్బతీయడమే అన్నారు.అభివృద్ధి పనులు చేయడానికి ముందు వంద కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాలని చెప్పడం దయ్యాలు వేదాలు వల్లినట్లుగా అభివర్ణించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మానంలో,25 కోట్ల రూపాలయు ఇస్తామని చెప్పి కాళేశ్వర అబివృద్దికి ఎలాంటి అకౌంట్లలో డిపాజిట్లు చేసారని ప్రశ్నించారు.దేవాలయ అభివృద్దితో ఈ ప్రాంతం ప్రజలు అనేక విధాలుగా అభివృద్ధి చెందుతారని అన్నారు.ఇప్పటికైనా సద్బుద్ధితో మాట్లాడాలని తప్పుడు ఆరోపణలు చేయడం దేవుని శిక్షకు గురికావాల్సి వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనా బానో,కాంగ్రేస్ సీనియర్ నాయకులు వామన్ రావు,కట్కం అశోక్,కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోత రామకృష్ణమాజీ ఎంపిటిసి కుతోట సుదాకర్,కోట సమ్మయ్య,తిరుపతి రెడ్డి, వంంకరయ్య,బుర్రి శివరాజ్, పాల్గొన్నారు.

## పాఠశాలకు సౌండ్ బాక్స్ విరాళం..

**ప్రజాపక్షం/నర్సింహులపేటః** మండలంలోని సడమటిగూడెం ప్రభుత్వ పాఠశాలకు గ్రామ అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను చాటుతూ మాజీ సర్పంచ్ జొన్నగడ్డ యాదలక్ష్మి వెంకన్న దంపతులు 10వేలు,ఆర్ఎంపీ డాక్టర్ గువ్వ వెంకన్న5వేలు మొత్తం 15వేల రూపాయల విలువ గల సౌండ్ బాక్స్‌ను అందించారు. పాఠశాలలో నిర్వహించే విద్యా కార్యక్రమాలకు ఈసౌండ్ సిస్టం ఎంతో ఉపయోగపడుతుందని,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవపరమైన సౌకర్యాల కల్పనలో దాతలు ముందుకు రావడం అభినందనీయమని టీచర్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియాజేశారు. విద్యార్థినీ, విద్యార్థులు కూడా దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ వారి సేవా భావాన్ని కొనియాడారు. గ్రామంలో విద్యాభివృద్ధికి ఇలాంటి సహాయ సహకారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్ సునీత పరామర్శ



**ప్రజాపక్షం/గూడూరు;** గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని సాయిరాం హోటల్ నిర్వాహకుడు జీవంజీ రవీందర్ మృతి చెందడం పట్ల గూడూరు సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం రవీందర్ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆమే తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు గార్లపాటి శిరిష రాజేష్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకలు గ్రామస్థులు తదితరులు పాల్గోన్నారు.

## ఇన్‌చార్జ్ ఎంపిడిఒను సన్మానించిన ఉపసర్పంచుల ఫోరం..



**ప్రజాపక్షం/నర్సింహులపేటః** మండల ఇంచార్జ్ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్‌ను మండల ఉపసర్పంచుల ఫోరం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈసందర్భంగా ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు చుక్క వేణు, జిల్లా ఉపాధ్యక్షులు కాస యాకయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాకుబ్, ఉపాధ్యక్షుడు జోగి ఉమేష్, గ్రామ యూత్ అధ్యక్షులు నిమ్మల శీనివాస్‌లు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.మండల అభివృద్ధికి , గ్రామ పంచాయితీల బలోపేతం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైనా సేవాలు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. అలాగే గ్రామపంచాయితీల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రత్యేక దృష్టి సారించాలని ఉపసర్పంచుల ఫోరం నాయకులు కోరారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

### రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సూచన

**ప్రజాపక్షం/గూడూరు;** ఎల్‌నినో ప్రభావంతో ఉన్న సంవత్సరాల్లో సాధారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందని అలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకోని రైతులు తక్కువ నీటితో సాగు చేయగలిగే పంటలను ఎంపిక చేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు.శుక్రవారం నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో పోడి పరిస్థితులను తట్టుకునే జొన్న సజ్జ రాగి పెసలు మినుములు కంది వేరుశెనగ సోయాబీన్ వంటి పంటలు సాగుకు అనుకూలమని తెలిపారు.నీటి లభ్యత కొంత మేర ఉన్న ప్రాంతాల్లో పత్తి సాగు కూడా చేపట్టవచ్చని పేర్కొన్నారు.అధిక నీటి అవసరం ఉండే వరి వంటి పంటల సాగును తగ్గించడం మంచిదని ముఖ్యంగా నీటి నిల్వాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు.రైతులు తక్కువ కాలంలో పండే విత్తన రకాలను ఎంచుకోవడంతో పాటు డ్రిప్ స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటి పారుదల పద్దతులను వినియోగించాలని చేప్పారు.వర్షపు నీటీని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేసుకోవడం ఆలస్యంగా కురిసే వర్షాలకు అనుగుణంగా విత్తనాలను సిద్దంగా ఉంచుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.మారుతున్న వాతావరణ పరిస్తితులను అవలంబించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ పెర్కోన్నారు. ఈకార్యక్రమంలో బొద్దుగొండ సర్పంచ్ బండి కృష్ణ తో పాటు గ్రామ పెద్దలు రైతులు ఏఈఓలు పాల్గోన్నారు.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



**ప్రజాపక్షం, తొర్రూరు :** గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని స్టేట్ కన్సల్టెంట్ అధికారి సాయికుమార్, తహశీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి రామనర్సయ్య అన్నారు. తొర్రూరు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వందేమాతరం ఫౌండేషన్ భవన్‌లో శుక్రవారం జీపీడీపీ(గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక), సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమన్వయం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామ పంచాయతీల పాత్రపై వివరించారు. వర్క్‌షాప్‌లో వివిధ శాఖల మండల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. గ్రామాల వారిగా ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. మండలంలోని అనేక గ్రామాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉందని, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, సాగునీటి వనరుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజల అవసరాలకు అనుగుణంగా జీపీడీపీ ప్రణాళికలను రూపొందించి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులు సూచించారు. వర్క్ షాప్‌లో పాల్గొన్న సర్పంచ్‌లు తమ గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ప్రస్థానంలో రాష్ట్ర సాధన దిశగా అడుగులు వేసిన ఉద్యమకారుల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ జాపీసీల చైర్మన్‌లు డోలి సత్యనారాయణ, కల్వకొలను ప్రవీణ్‌రాజు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలో సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆత్మీయ సభకు ఉద్యమకారులు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చుకొని రాష్ట్ర ఏర్పాటుకు ఊపిరి పోసిన ఉద్యమకారుల ఐక్యతను పటిష్టం చేయడం కోసం వారికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం గౌరవార్థం ప్రభుత్వం డాక్టర్ కె.కేశవరావు అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకతీతంగా, పారదర్శకంగా అర్హులను గుర్తించి వారికి తగిన సముచిత గుర్తింపు, సౌకర్యాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. పారదర్శకంగా ఉద్యమకారుల ఎంపిక చేయాలన్న ఆలోచనతో మహబూబాబాద్ అన్ని డివిజన్‌లలో జేపీసీల సమన్వయంతో రాష్ట్రంలో మొదటి సభ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సభకు కమిటీ సభ్యులైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, విప్ అద్దంకి దయాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని అన్నారు. పార్టీకలతీతంగా తెలంగాణ కోసం గర్జించిన ఉద్యమనాయకులు, మేధావులు, విద్యార్థులు, జర్నలిస్టులు, తదితర కుల సంఘాల నాయకులు ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు పిల్లి సుధాకర్, మైస శ్రీనివాస్, లేగల వెంకట్‌రెడ్డి, రాయిశెట్టి వెంకన్న, బిజ్జాల వెంకటరమణ, వేల్పుల రమేశ్, యాకయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భూధార్ సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/జనగామ:** భూధార్ సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదాబైనామా, రీ సర్వే ప్రక్రియలను గదువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైధరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్ పలు జిల్లాల కలెక్టర్లతో భూ ధార్ సర్వే, భూ భారతి, సాదాబైనామా, నాన్ కడాస్ట్రల్ గ్రామాల రీ సర్వే, నక్షా కార్యక్రమం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహశజల్దార్ అనిల్ బాబు, సంబంధిత రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.

## ఎనీమియా రహిత సమాజమే లక్ష్యం: డాక్టర్ సుగుణాకర్ రాజు

**ప్రజాపక్షం/తొర్రూరు :** ఎనీమియా రహిత సమాజమే లక్ష్యమని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. సికిల్ సెల్ దినోత్సవ వేడుకలను డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ మేనరిక వివాహాలు, వంశపారపర్యంగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, జన్యుపరమైన వ్యాధి అని అన్నారు. శరీరంలో రోగ నిరోధకశక్తి తగ్గి ఆక్సిజన్ స్థాయిలు క్షీణిస్తాయన్నారు. ప్రధానంగా రక్తహీనత లోపిస్తుందన్నారు. 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయన్నారు. మహిళలు సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి జ్వలిత, నందనదేవి, ప్రియాంక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవానికి ఘన శ్రీకారం

### మరిమిట్ట అటవీ ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమం ప్రారంభం

**ప్రజాపక్షం/గూడూరు;** రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గూడూరు రేంజ్ పరిధిలోని మరిమిట్ట అటవీ ప్రాంతంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్‌రావు ఉపాధ్యాయులు గ్రామస్థులు విద్యార్థులు పాల్గోన్ని మొక్కలు నాటారు. ఈసందర్భంగా రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ వర్షాకాలం మొత్తం మనహోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంతో కీలక పాత్ర పోసిస్తాయని పేర్కోన్నరు. విద్యార్థులు మొక్కలు ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులు కూడా మొక్కలు సంరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఎంఆర్పి రావు రమేష్ బుచ్చిబాబు సోమ సుధాకర్ స్వాతి విజయ మోహన్ ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు ఆవులు మృతి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందిన సంఘటన దేవరుప్పుల మండలంలోని లకావత్ తండా గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే సాయంత్రం ఆవులను దొడ్డిలో కట్టేసి వెళ్లగా రాత్రి వర్షం పడుతున్న సమయంలో పిడుగు పడడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయన్నారు. రైతు లకావత్ లచ్చిరాం సుమారు రూ.1.5లక్షల విలువగల ఆవులు మృతిచెందాయన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డా. ఏ స్వర్ణ శిల్ప, జీపీవో వెంకటేష్, సెక్రటరీ సంఘటన స్థలం పరిశీలించి మృతికి పిడుగు కారణమన్నారు. కాగా బాధితరైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## అధికారులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/జఫరగడ్:** తిమ్మంపేట గ్రామంలో బదిలీపై వెళ్లిన వెటర్నరీ అసిస్టెంట్ డైరక్టర్ డా. సారంగపాణి, పంచాయితి కార్యదర్శి గాదె ప్రశాంత్‌లకు ఇంచార్జి సర్పంచ్ మండల రాకేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కొత్త పంచాయితి కార్యదర్శిగా పరుశరాములు, వెటర్నరీ డాక్టర్గా రవి ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత, వార్డు మెంబర్ కుమారస్వామి, అరుణ, అనిల్, డాక్టర్ స్వాతి, ఏఎన్ఎం అనిత, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని రామ్‌సాగర్, బెజ్జంకి క్రాసింగ్,తోటపల్లి, లక్ష్మి పూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన భాధిత కుటుంబాలను శుక్రవారం మానకొండూర్ మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాకాల మహిపాల్ రెడ్డి,లింగాల లక్ష్మ ణ్, ఎల శేఖర్ బాబు, శ్రీనివాస్ రావు, కవ్వంపల్లి శ్రీనివాస్,వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై బిఎల్‌ఒలకు శిక్షణ

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం, శుక్రవారం ధూల్మిట్ట మండలకేంద్రంలోని రైతు వేదికలో తహశీల్దార్ శ్యామ్ ఆధ్వర్యలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ, క్షేత్ర స్థాయి విధులు, నిబంధనలపై బిఎల్‌వోలకు తహశీల్ధార్ శ్యామ్ వివరించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నవీన్ కుమార్, జీపీఓలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్సా పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సా పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బైరి ఎల్లాగౌడ్ (45) గత పదిహేను రోజుల క్రితం జగదేవ్‌పూర్ సమీపంలోని కాటన్ మిల్లు వద్ద వడ్ల లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేనుక నుండి మోటార్ సైకిల్‌తో బలంగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతన్ని కొంపల్లి లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్సా అందించారు. చికిత్సాపొందుతూ అతడు గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# రైతు భరోసా పేరుతో మరోసారి రైతులకు మోసం

### మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతల విమర్శ



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రైతు బరోసాతో పేరుతో మల్లి రైతులను మభ్య పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతుందని జగదేవ్‌పూర్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి విమర్శించారు. శుక్రవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ యాసంగికి రెండు ఎకరాలకే రైతు బరోసా వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం రైతు బరోసా ఒకే దపలో వేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని వారు ఆరోపించారు. యాసంగి రైతు బరోసాను పూర్తిగా వేసిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన గడువులోపు ఒకే దపలో వానకాలం బరోసాను రైతు ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ జేశారు. రెండున్నర ఎండ్ల రేవంత్‌రెడ్డి పాలనలో రెండు సీజన్ల రైతు బరోసాను ఎగగొట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని వారు ఎద్దవా జేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారన్నారు. సాగు నీరు,రసాయాన ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోల్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. మిల్లర్లతో ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై రైతులు పండించిన ధాన్యం సేకరణలో నాణ్యత పేరుతో వారిని నట్టేట ముంచారని ఆరోపించారు. ప్రభుత్వం ఆనాలోచిత కారణాల వల్ల మండలంలో అధిక సంఖ్యలో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వ యాత్రంగాం పూర్తిగా విఫలం చెందిందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

# రైతులకు ఆన్‌లైన్ ద్వారా కాకుండా పాత పద్ధతి ద్వారా ఎరువులు, విత్తనాలను అందించాలని డిమాండ్

**ప్రజాపక్షం/ హుస్నాబాద్:** జూన్ 19. రైతులకు ఆన్‌లైన్ ద్వారా కాకుండ పాత పద్దతి ద్వారా ఎరువులను విత్తనాలను అందించాలని డిమాండ్ చేస్తు బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవా రం వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఆందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి రైతుల బతుకుల అధొగతి పాలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రైతులకు సకాలంలో విత్తనాలు ఆందితే ఎరువులు ఆందలేదు విత్తనాలు ఆందితే సకాలంలో ఎరువులు దొరక్క పొవడంతో పంటలకు ఎరువులు వేసే సమయాలకి వేయకపోవడంతో పంటలు దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడ రాక ఆనేక బాధలు పడ్డారని ఆన్నారు. ఎరువుల దుకాణల్లో నఖిలి విత్తనాల నియంతణ చేపట్టాలని ఆధికారులను కొరారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఆందించాలని ఆలాగే రైతులకు పెట్టుబడి కోసం బ్యాంకులు రుణాలను సకాలంలో ఆందించి ఆదుకోవాలని కొరారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం లో ఏ ఒక్క నాడు కూడ ఎరువులు, విత్తనాలు, కరంటు కొరతరాలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ఎరువుల కోసం గత 20 ఏళ్ల క్రితం ఉన్న విధానం చెప్పులు లైనుల్లో పెట్టుడు మళ్లి వచ్చిందని రైతులు మొత్తుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి ఎరువులు గాని విత్తనాలు గాని సకాలంలో ఆందించి ఆదుకోవాలని లేకుంటే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పార్టీ నాయకు లు శ్రీనివాస్, గాల్‌రెడ్డి, భూక్యరాజు, జానకిరాంరెడ్డి, పాల్గొన్నారు.

# విద్యార్ధులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** సెల్స్‌పోర్స్ కంపెనీ ఉద్యోగుల ఆద్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంఫిణి చేశారు. భారత నగర్ డివిజన్ పరిదిలోని ఎల్ఐజి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కు సెల్స్‌పోర్స్ కంపెని ఉద్యోగుల ఆద్వర్యంలో విద్యార్థుల కు మాజీ కార్పోరేటర్ సందు ఆదర్స్ రెడ్డి చేతుల మీదుగా బ్యాగులు ,పుస్తకాలు పంఫిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్ర్పోటర్ సింధు ఆదర్స్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పాఠశాల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌళిక వసతులకు మెరుగైన సెల్స్ పోర్స్ ప్రతినిధులను కోరారు. దీనికి స్పందించిన వారు. పాఠశాల అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెల్స్ పోర్స్ కంపెనీ ఉద్యోగులు కార్ల్ లార్చినా ,అర్జున్ సాహా, పాండు రంగారావు, రాళ్లపల్లి ఎల్ఐజి కాలనీ అద్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శ్యామ్యూల్ జాన్, సత్యవతి సరిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థ విద్యాభివృద్ధికి సహకరిస్తున్న సెల్స్ ఫోర్స్ కంపెనీ ఉద్యోగులను ఈ సందర్భంగా అభినందించారు.

# రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులను పూర్తిగా దగా చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం నెల్లూరు పెద్దాపూర్ గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేశారు. నెల్లూరు గ్రామంలో 10 లక్షలతో నిర్మించిన స్కూల్ ప్రహరీ గోడను ఆమె ప్రారంభించారు. అనంతరం స్కూల్లో పిల్లలు మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. పెద్దాపూర్ గ్రామంలోని పిట్టల వాడలో ఐదు లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి అక్కడి పిట్టల వాడ ప్రజలతో మాట్లాడారు. వాళ్లకు ప్రభుత్వం తరపున ఇల్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బస్వాపూర్ గ్రామంలో జరుగుతున్న గ్రామదేవతల మొదటి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి పథకం ద్వార శెట్టిపల్లి రామయ్య పల్లి దామరంచ వెల్దుర్తి మహిళా సమైక్య భవనాలు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. మండలంలో వివిధ పాఠశాలలకు ప్రహరీ గోడలు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ధాన్యం కొ నుగోలు విపలమైందని కెసిఆర్ పాలనలో రైతులకు స్వర్ణ యుగం అని కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు చూస్తున్నారని, ఈ ప్రభుత్వం అన్ని రంగాల లోవిఫలమైందనిఆమె అన్నా రు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ విజయలక్ష్మి ఎంపీడీవో హరి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షు లు భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు శాకారం శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, వెల్దుర్తి ఉపసర్పంచ్ కమ్మరి శ్రవణ్ కుమార్, బిఆర్ఎస్ జిల్లా నాయకు లు కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిగుల్‌లో డ్రై డే



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలోని తిగుల్‌లో శుక్రవారం డ్రై డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు గ్రామంలో పర్యాటించి వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్థులను చైతన్యం చేశారు. అలాగే ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇండ్ల ముందు ప్లాస్టిక్ వస్తువులలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానకాలం ప్రారంభం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చోరవ చూపాలన్నారు. నీటి నిల్వలతో మలేరియా, డేంగ్యూ లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. మన ఊరు, మన ఆరోగ్యం, మన పరిశుభ్రత అనే లక్ష్యంతో ముందుకు పోవాలని కోరారు.

## ''పేదల ఆత్మగౌరవానికి చిరునామా ఇందిరమ్మ ఇల్లు''

### జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** పేద ప్రజల సొంత ఇంటికలను సాకారం చేస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచే గొప్ప పథకం ఇందిరమ్మ ఇల్లు అని జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ ధూల్మిట్ట మండలం జాలపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను మండల హౌసింగ్ ఏఈ సహానితో కలసి సర్పంచ్ కమలాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ, మొదటి విడుతలో గ్రామానికి 31 ఇళ్లు మంజూరు కావడానికి సహకరించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పిటీసి గిరి కొండల్‌రెడ్డికి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 10 ఇళ్ల స్లాబ్ పనులు పూర్తియ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

## సురభి ఆసుపత్రిలో ఫేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ సక్సెస్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ పరిధిలోని సురభి మెడికల్ కళాశాల అనుబంధ సురభి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో భాగంగా శుక్రవారం ఫేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు సురభి ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీప్తిరావు తెలిపారు. చెర్యాలకు చెందిన బాలమ్మ(76) గుండెకు సంబంధించిన సమస్య రావడంతో రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చారని,గుండె నెమ్మదిగా కొట్టుకుండడాన్ని గ్రహించిన డాక్టర్లు ఫేస్‌మేకర్ చికిత్స అవసరం అని తెలిపారన్నారు. పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ అనేది గుండె కొట్టుకునే వేగం చాలా నెమ్మదిగా ఉన్నప్పుడు దానిని క్రమబద్ధీకరించడానికి చాతి చర్మం కింద అమర్చిన చిన్న ఎలక్ట్రానిక్ పరికరం అని అన్నారు. గుండెలోని విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో బ్లాక్‌లు ఉన్నప్పుడు గుండె లయ తప్పుతుందని దానిని సరిచేయడాన్ని ఫేస్ మేకర్ ఇంపలాంటేషన్ అవసరమవుతదన్నారు. సర్జరీ జరిగిన తర్వాత రోగి క్షేమంగా ఉన్నారని అన్నారు. నిరుపేదలకు గ్రామీణ ప్రాంతంలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి చైర్మన్ హరీందర్ రావు ఆశయాలకు అనుగుణంగా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు,ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్దాప్య దశలో ఉన్న వ్యక్తికి అరుదైన చికిత్స నిర్వహించిన డాక్టర్లు బృంధాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ వంశీ,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నాటిన మొక్కలు సంరక్షించాలి

ఎంఇఒ బుచ్యానాయక్



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రతీఒక్కరి నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంఈఓ బుచ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బడిబాట సందర్భంగా హరితోత్సవంలో భాగంగా సర్పంచ్ ఆకుల కొమురయ్యతో కలసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు పెరిగే వరుకు వాటి సంరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బోళ్ల భిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం నర్సాగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణంతో ఆర్థికంగా ఎదగాలి

సర్పంచ్ మోకాళ్ల నవీన్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** బ్యాంకు లింకేజి ద్వారా తీసుకున్న రుణంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ మోకాళ్ల నవీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో గ్రామానికి చెందిన సాలె చంద్రకళ ఝాన్సి సంఘం సభ్యురాలు కిరాణా ఏర్పాటు షాపును సర్పంచ్ మోకాళ్ల నవీన్, ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్‌తో కలసి ప్రారంభించారు. చిరు వ్యాపారంతో ఆర్థికంగా ఎదగి ఇతరులకు ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ యాదగిరి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ అధికారి, వార్డుమెంబర్లు, గ్రామసంఘం అధ్యక్షురాలు, వివోఏలు, లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## నాలుగు రకాల చెత్తపై అవగాహన




**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో నాలుగు రకాల చెత్త విభజనపై గ్రామస్థులకు శుక్రవారం అధికారులు అవగాహన కల్పించారు. గ్రామస్థులందరు గ్రీన్ బుట్టలో తడిచెత్త, నీలి రంగు బుట్టలో పొడి వ్యర్థాలు, ఎరుపురంగు బుట్టలో శానిటరి చెత్త, నలుపురంగు బుట్టలో ప్రత్యేక/హానికర చెత్తలను ఇలా వేరువేరుగా చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి ఇవ్వాలని డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్‌బాబు అన్నారు. గ్రామస్థులందరు సహరించినప్పుడే చెత్త సేకరణ జరిగి గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఎం పెంటాగౌడ్, డాక్టర్ శ్రీహర్ష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పుష్పేంద్రసింగ్ షెకావత్, ఐకేపీ సీసీ సరిత, వీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వార్డుమెంబర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ) 2026 పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఒకే పరీక్షా కేంద్రంలో 481 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, ఒరిజినల్ ఫోటో ఐడి కార్డు, ఫోటోలు వెంట తీసుకురావాలని, మధ్యాహ్నం 1.30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, గడియారాలు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర నిషేధిత వస్తువులు తీసుకు రావద్దని హెచ్చరించారు. పరీక్ష నిర్వహణకు పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. పరీక్ష విజయవంతానికి తల్లిదండ్రులు, అభ్యర్థులు సహకరించాలని అధికారులు కోరారు. కలెక్టర్ వెంట ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీ రమాదేవి, డీఎస్పీ ప్రసన్న కుమార్ సంబంధిత రెవిన్యూ, పోలీస్, వైద్య, తపాలా, విద్యుత్, ఆర్టీసీ, రవాణా ఎడ్యుకేషన్ అధికారులు ఉన్నారు.

## నేడు పిఎం కిసాన్ 23వ విడత నగదు విడుదల



**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** ప్రదాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం కింద రైతులకు 23వ విడత ఆర్థిక సహాయాన్ని శనివారం (జూన్ 20) మధ్యాహ్న 3:45 గంటలకు ప్రధాన మంత్రి చేతుల మీదుగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి విడుదల చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద శంకరంపేట మండలంలోని రైతు వేదికల వద్ద కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో రైతు వేదికలకు హాజరై కార్యక్రమాన్ని వీక్షించాలని ఆయన కోరారు. పీఎం కిసాన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనున్న నేపథ్యంలో రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పథకం వివరాలను తెలుసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

## 21న రామాయంపేటలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



**ప్రజాపక్షం/రామాయంపేట:** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాదాన్యమిస్తూ రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 21న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి పట్టణ అద్యక్షులు శీలం అవినాష్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు సౌజన్యంతో, శశిర హాస్పిటల్ సహకారంతో ఈవైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈకార్యక్రమానికి ముఖ్య అథితిగా ఎంపీ హాజరవుతున్నట్లు తెలిపారు. మహిళల్లో క్యాన్సర్ వ్యాదిపై ముందస్తు అవగాహన కల్పించడం, ప్రారంబ దశలోనే వ్యాధిని గుర్తించడం లక్ష్యంగా ఈకార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ టెస్టులకు 20నుండి 30వేల వరకు ఖర్చు అవుతుందని వీటిని ఉచితంగా చేసి పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సలహాలు, రిపోర్టులు మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమాన్ని మండల పరిదిలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## జర్నలిస్టుల సంక్షేమమే టియుడబ్ల్యుజె ధ్యేయం

జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి



**ప్రజాపక్షం/కొల్చారం :** జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టియూడబ్ల్యుజే యూనియన్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారం లో ప్రసిద్ధ జైన ఆలయం వద్ద టి యూడబ్ల్యూజే యూనియన్ లో సభ్యత్వ నమోదు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శంకర్ దయాల్ చారి తో పాటు, టీయూడబ్ల్యూజే నాయకులు తిమ్మన్న గారి శ్రీధర్, సంతోష్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ టియుడబ్ల్యూజే పాత్రికేయులు సంక్షేమానికి, అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నాగభూషణం, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, ఏసు రత్నం, బిక్షపతి నేత, టి శ్రీధర్, రాజు, రామేష్, భూపాల్, నవీన్, వంశీ, శ్రీధర్, అనిల్ చారి, భూమయ్య, ప్రవీణ్, శ్రీశైలం, పురుషోత్తం, నర్సింలు, శ్రీను, లక్ష్మీ నారాయణ, యాదగిరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవాం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెంకట గౌడ్ మాట్లాడుతూ దేశంలో ప్రేమాభిమానాలు ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర చారిత్రాత్మకమని అన్నారు. పేదల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాబు, సిద్దిరాములు, లక్ష్మ గౌడ్, అమర్ సేనా రెడ్డి, మల్లేశం, వెంకటేశం, నసిరుద్దీన్, రాములు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోతంశెట్టిపల్లి పాఠశాలను సందర్శించిన డిఇఒ




**ప్రజాపక్షం/కొల్చారం :** కొల్చారం మండలంలోని పోతం శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మెదక్ జిల్లా విద్యాధికారి రాజు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, మౌలిక వసతులు, బోధనఅభ్యాస కార్యక్రమాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా విద్యాధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. ఉమారాణి, ఉపాధ్యాయులు సంగయ్య, మాధుకర్, సిద్దిరాములు, పోచయ్య, తులసి, శ్రీనివాస్, సునీత మండల వనరుల కేంద్రం సిబ్బంది నంపత్ కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం పరశురాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి హాజరై విద్యార్థులకు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం అర్జున్, వార్డు మెంబర్లు సతీష్, బాలరాజు, స్వామి ఉపాధ్యాయులు గీత, సృజన విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస్, సుస్మిత, సారిక, మౌనిక, రేఖ, సౌమ్య,రేణుక, బాలమణి, స్రవంతి, రమ్య, శ్రీజ, షాహీన్,తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే భవిష్యత్‌కు బంగారు బాట

మండల విద్యాధికారి శంకర్




**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే భవిష్యత్‌కు బంగారు బాట అన్నారు. ప్రతి చిన్నారి బడిబాట పట్టి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను వివరించిన ఆయన తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమణి, గౌస్ ఖురేషీ, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ అశోక్, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు






**ప్రజాపక్షం/సంగారెడ్డి** : రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు జగ్గారెడ్డి కానుక అందించారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆద్వర్యంలో సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా 200 కిలోల భారీ కేక్‌ను చిన్నారులతో కలసి కేట్ చేసి 350 మంది చిన్నారులకు సైకిళ్లను పంపిణి చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశాబివృద్ధికి బిహెచ్ఈ ఎల్ ,బిడిఎల్, ఇక్రిశాట్, ఐఐటి హైదరాబాద్ వంటి అనేక కీలక సంస్థలను అందించిందని ప్రస్తుతం బీజేపి ప్రభుత్వం కేంద్ర రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. నెహ్రూ కుటుంబం దేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ గత 12ఏళ్ల మోదీ పాలనలో దేశానికి జరిగిన ప్రయోజనాలపై బీజేపి నేతలు సమాదానం చెప్పాలని సవల్ విసిరారు. ప్రతి ఏడది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువత ఆశలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. రాహుల్ గాందీ దేశానికి అవసరమైన నాయకుడని భవిష్యత్తులో ఆయన దేశ ప్రదాని కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు ,చిన్నారులు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/రాంచంద్రాపురం** : సైబరాబాద్ మున్సిపల కమిషనరేట్ పరిధిలోని పటాన్చెరు నియోజకవర్గం భీరంగూడ, అమీన్పూర్, 270,271 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో పట్టణ అద్యక్షులు శశిధర్‌రెడ్డి నేతృత్వంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అద్యక్షులు ,భావి భారత ప్రదాని,జాతీయ ప్రదాన ప్రతి పక్షనాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్బంగా కేక్‌కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాహుల్ గాంధీ సమీప భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టి భారతదేశానికి దిక్సూచిగా నిలిచి ప్రపంచ పటంలో అగ్రభాగాన నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూరు** : ఆత్మకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆత్మకూరు మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు రేవూరీ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి జనరల్ సెక్రెటరీ కూచన రవళి రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా రవళి రెడ్డి కేక్ కట్ చేసి అరటి పండ్లను పంపిణీ చేసి మాట్లాడుతూ రాహుల్ గాంధీ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని భారత ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తూ భావిభారత ప్రధానిగా ఎదగాలని కోరుకుంటున్నామని, మేమందరం కాంగ్రెస్ సేవకులుగా పనిచేసి భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధానిగా ఎన్నిక చేయడానికి ప్రత్యేక భూమిక పోషిస్తామని ఈ సందర్భంగా అన్నారు.. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు రమేష్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, మాజీ పిఏస్ చైర్మన్ ఏర్కొండ రవీందర్, మాజీ సొసైటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, అక్కంపేట సర్పంచ్ ముద్దం సాంబయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు, రాహుల్ గాంధీ అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కొనియాడారు. హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించిందన్నారు. ద్వేషపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా, దేశ ప్రజలను ఏకం చేసేందుకు ఆయన పడిన శ్రమ అమూల్యమైనదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ప్రజల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇ.వి శ్రీనివాస్ రావు, వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తొర్రూరు :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ భవితకు దిక్సూచి అని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్‌లతో కలిసి మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబానికి చెందిన నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. గాంధీ కుటుంబ వారసుడిగా రాజకీయాల్లోకి ఎంట్రి ఇచ్చిన రాహుల్ గాంధీ తనదైన మార్క్‌తో దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించారని అన్నారు. లోకసభ ఎన్నికల్లో విపక్షాలన్నింటిని ఏకతాటిపైకి తీసుకొచ్చి బీజేపీని సమర్థంగా నిలువరించడంలో రాహుల్‌గాంధీ ఎంతో సక్సెస్ అయ్యారని అన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వం భవిష్యత్తులో దేశానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకన్నయాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ ముద్దసాని సురేశ్, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండాల నర్సయ్య, చెవిటి సుధాకర్, జక్క మహబూబ్‌రెడ్డి, రవీంద్రాచారి, దొంగరి శంకర్, రాజేశ్‌యాదవ్, సర్పంచ్‌లు బంగారు రమేశ్, ఎర్ర వెంకట్‌రెడ్డి, అభిరాంనాయక్, మాధవరెడ్డి, కవిత, బాలకృష్ణ, గంగా నరేశ్, సావిత్రి శ్రీనివాస్, యూత్ పట్టణ అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, నాయకులు గూడెల్లి రామచంద్రయ్య, ఎనగందుల శ్రీనివాస్, చిన్న కోటయ్య, ప్రవీణ్‌నాయక్, పరశురాములు, ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రాయపర్తి:** ఘనంగా ఏఐసిసి నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ పాలన కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా ఉందని అన్నారు. ఆదాని, అంబానిలు తప్పా బిజెపితో సామాన్య ప్రజలు ఎలాంటి ప్రయోజన లేదని అన్నారు. ప్రజలు రాహుల్‌గాంధీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ రమేష్, మందాటి సుదర్శన్ రెడ్డి, ఎండి నయిమ్, ఎండి అఫ్రోజ్, కాంచనపల్లి వనజ రాణి, మండల యూత్ అధ్యక్షుడు కళ్యాణ్ గౌడ్, ఎండి రఫి, గట్టికల్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నంచర్ల లక్ష్మణ్‌చారి, ఎండి రియాజ్, నరసింహులా రాంమూర్తి, గారే ఉప్పలస్వామి, ఉబ్బని బాబు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** కాంగ్రెస్ అధినేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9.30గంటలకు పోచమ్మ మైదాన్ జంక్షన్ నందు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, టిపిసిసి డెలిగేట్ సభ్యులో నల్గొండ రమేష్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా భారీ కేక్‌ను బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో కట్ చేసి పేదలకు, స్థానిలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా వరంగల్ జిల్లా కోఆర్డినేటర్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సేవాదళ్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం / నర్సంపేట :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ నాయకత్వంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మాదాసి రవి, ఎండి అయూబ్ ఖాన్,ఎలకంటి విజయ్ కుమార్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్,పొన్నాల నరసింహ,మాజీ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ తుమ్మలపెల్లి సందీప్, బైరి మురళి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** లోక్ సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ 56 వ జన్మదిన వేడుకలు భీమదేవరపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జక్కుల అనిల్ యాదవ్, హుస్నాబాద్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్ , యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ చిత్తకూరి అనిల్, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ గుడి కందుల రాజు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బుర్ర ప్రశాంత్, హుస్నాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి బొల్లంపల్లి కాంతారావు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి వల్లెపు మహేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదరి రాజేందర్ , గిరబోయిన అఖిల్ యాదవ్ ,చిట్కూరి నితిన్, రవితేజ, నిఖిల్, ఎలబాక సురేష్, కూన ప్రశాంత్, శేఖర్, షఫీ, కైసర్, అజయ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జనగామ:** జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను డీసీసీ అద్యక్షురాలు ధన్వంతి లక్ష్మి నారాయణ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, డీసీసీ కమిటి సభ్యులు, మండల, బ్లాక్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

